www.siddipetpower.com

# సిద్ధిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 142 | హైదరాబాద్ | ఆదివారం | 10-08-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## ఆర్టీసీ సిబ్బంది పని తీరు అద్భుతం

హైదరాబాద్ ఆగస్టు 09 (సిద్దిపేట పవర్):

రాఖీ పండగ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది అద్భుతంగా పని చేశారని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. గతేడాది రాఖీ పండగ సందర్భంగా ఒక్క రోజే 63 లక్షల మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసినట్లు గుర్తు చేసుకున్నారు. గత రాఖీకి మూడు రోజుల్లో రికార్డు స్థాయిలో 1.77 కోట్ల మంది ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించారన్నారు. ఈసారి కూడా అదే రీతిలో సిబ్బంది పని చేశారని మంత్రి పేర్కొన్నారు. సోదరభావానికి ప్రతీకైన రాఖీ పండగను త్యాగం చేసి.. నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహించారని ప్రశంసించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మహాలక్ష్మి పథకాన్ని మహిళలు వినియోగించుకుంటూ.. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి తమ స్వగ్రామంలోని సోదరుల దగ్గరికి వెళ్లి రాఖీలు కట్టారంటూ.. వారందరికీ అభినందనలు తెలిపారు.



## అది దేవస్థానమా లేక శ్మశానమా?

తవ్వేకొద్దీ ఎముకలు, పుర్రెలు బయటపడుతున్నాయి..

కలకలం రేపుతున్న ధర్మస్థల మిస్టరీ హత్యలు

500 మంది అమ్మాయిలపై హత్యాచారం చేసి పూడ్చి పెట్టారన్న నారాయణ

ట్రస్ట్ ఛైర్మన్, సభ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్



2

## ఈసీ సంచలనం.. 334 రాజకీయ పార్టీలపై వేటు

గత ఆరేళ్లుగా ఒక్క ఎన్నికలోనూ పోటీ చేయకపోవడమే కారణం

రిజిస్టర్డ్ చిరునామాల్లోనూ కనిపించని పార్టీ కార్యాలయాలు

ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా ఈసీ కీలక నిర్ణయం

తాజా చర్యతో 2,520కి తగ్గిన గుర్తింపు లేని పార్టీల సంఖ్య

దేశంలో 6 జాతీయ, 67 రాష్ట్ర పార్టీలు ఉన్నాయని వెల్లడి




2

# ఏది అక్రమం.. ఏది సక్రమం?..

## కాంగ్రెస్ సర్కారు తీరుతో హైదరాబాద్ వాసుల్లో సందిగ్ధం

కుప్పకూలిన రియల్టీ..
దానికితోడు 'ఆక్రమిత' ప్రాజెక్టులు !

ఖాజాగూడలో 27 ఎకరాల
ప్రభుత్వ భూమి హాంఫట్

మ్యాన్‌హట్టన్' పేరుతో
ప్రాజెక్టు..కన్నెత్తి చూడని హైడ్రా

సర్కారు ఉదాసీనతపై
కోర్టుకెక్కిన నలుగురు ఎమ్మెల్యేలు

అందులో ఫ్లాట్లు కొనొద్దని
ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రకటన

గోపన్‌పల్లిలోని సర్కారు
భూమిలోనూ ప్రైవేటు వెంచర్లు!

గతంలో రూ.15 వేల కోట్ల
ప్రాజెక్టులు అక్రమమన్న భట్టి



హైదరాబాద్ ఆగస్టు 09 (సిద్దిపేట పవర్):

తెలంగాణ ప్రభుత్వప్రైవేటు ఆర్థిక వ్యవస్థలకు వెన్నెముకలాంటి రియల్, నిర్మాణ రంగం సర్కారు పెద్దలకు పిల్లలాటగా మారిందనేందుకు ఉదాహరణలెన్నో. ఒకవైపు ప్రభుత్వ భూముల్లో వెంచర్లు, నిర్మాణాలకు అనుమతినిస్తూనే, మరోవైపు అక్రమ నిర్మాణాలంటూ ఎడాపెడా కూల్చివేతలు చేపడుతున్న సర్కారు ద్వంద్వ నీతి కొనుగోలుదారులకు సంకటంగా మారింది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే వరకు మూడు వెంచర్లు, ఆరు అపార్టుమెంట్లు అన్నట్లుగా విరాజిల్లిన ఈ రంగాలు రేవంత్‌రెడ్డి ప్రభుత్వ తప్పటడుగులతో గత 18 నెలలుగా నేలచూపులు చూస్తున్నాయి. ఖాజాగూడలో కొనసాగుతున్న మ్యాన్‌హట్టన్ ప్రాజెక్టు భూమి ముమ్మాటికీ ప్రభుత్వ భూమేనని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం గాంధీభవన్‌లోనే మీడియా సమావేశం నిర్వహించారు. దీనిపై హైకోర్టులో వేసిన పిల్‌పై విచారణ కొనసాగుతుందన్నారు. కోర్టు ఆదేశానుసారం మరోసారి ఫిర్యాదు చేశామన్న ఆయన, సదరు నిర్మాణ ..మిగతా 2లో

## రేవంత్ రెడ్డితో విభేదాలు ఉన్నాయనే వార్తలపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందన

అవన్నీ తప్పుడు వార్తలన్న పీసీసీ చీఫ్

రేవంత్ తో మంచి అనుబంధం ఉందని వ్యాఖ్య

బీసీ వ్యక్తి తెలంగాణ
సీఎం కావడం ఖాయమని ధీమా



2

## సినీ కార్మికుల సమ్మె.. కానరాని పరిష్కారం!

సినీ పరిశ్రమలో కొనసాగుతున్న కార్మికుల సమ్మె

ఆరో రోజుకు చేరిన సినీ కార్మికుల సమ్మె..

కనపడని పరిష్కారం!




2

# గిరిజనం.. గరం గరం!..

చేవేళ్ల డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ దగా

ఒక్క హామీ అమలు కాలేదని ఫైర్

ట్రైకార్ రుణాలు నిలిపేసిన సర్కార్

భవిష్యత్తు కార్యాచరణపై చర్చ

హైదరాబాద్ ఆగస్టు 04 (సిద్దిపేట పవర్):

కాంగ్రెస్ సర్కారు పేరెత్తితే చాలు రాష్ట్రంలోని ఆదివాసీ, గిరిజన సంఘాలు గుర్రుమంటున్నాయి. చేవేళ్ల డిక్లరేషన్ పేరిట గిరిజన సమాజాన్ని హస్తం పార్టీ దగా చేసిందని నిప్పులు చెరుగుతున్నాయి. హామీల అమలు సంగతేమో కానీ ఉన్నవాటినీ అటకెక్కిస్తున్నదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. హస్తంపార్టీపై పోరుబాటకు సిద్ధమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ..మిగతా 3లో





## ట్రంప్ పుతిన్ చర్చలను స్వాగతించిన భారత్

అమెరికా, రష్యా అధ్యక్షుల మధ్య కీలక సమావేశం

ఆగస్ట్ 15న అలస్కాలో భేటీ కానున్న ట్రంప్, పుతిన్

ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై చర్చించే అవకాశం

భేటీని స్వాగతించిన భారత విదేశాంగ శాఖ

రష్యా చమురు కొనుగోలుపై
భారత్‌కు సుంకాల ఊరట లభించే ఛాన్స్

సమావేశానికి ముందు ప్రధాని మోదీతో
ఫోన్‌లో మాట్లాడిన పుతిన్

2

## డమ్మీ వర్సిటీ.. ఫేక్ కోర్సులు?

జర్మనీ సంస్థతో ఎంవోయూలో జేఎన్‌టీయూ తప్పటడుగులు

ఒక్క చర్యతో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థకు మరక

కేఎఫ్ఆర్‌యూ సంస్థతో ఎంవోయూపై దుమారం

రెండు ఫారిన్ కోర్సుల్లో విద్యార్థులకు అడ్మిషన్లు

జర్మనీ లోని టాప్-3 వర్సిటీ అంటూ ప్రచారం

అది ఫౌండేషనే.. వర్సిటీ కాదంటూ ఫిర్యాదులు

అయినా స్పందించని జేఎన్‌టీయూ అధికారులు

అలాగే ముందుకెళ్తే విద్యార్థులకు తీవ్ర నష్టమే!




3

## కేటీఆర్..! ఎక్కడికి రావాలో టైం, డేట్ చెప్పు

కేటీఆర్ లీగల్ నోటీసుల గురించి
మాట్లాడటం సిగ్గుచేటన్న బండి సంజయ్

చీకటి రహస్యాలు బయటపడతాయంటూ
కేటీఆర్‌పై బండి సంచలన ఆరోపణలు

ధైర్యం ఉంటే ముఖాముఖి
చర్చకు రావాలంటూ కేటిఆర్‌కు సవాల్



2

## ఆధారాలు చూపించు, లేదంటే క్షమాపణ చెప్పు

ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై బండి సంజయ్‌పై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

48 గంటల్లోగా క్షమాపణ చెప్పాలని గట్టిగా డిమాండ్

లేకపోతే పరువునష్టం దావా వేస్తానని తీవ్ర హెచ్చరిక

త్వరలోనే లీగల్ నోటీసులు పంపుతామని వెల్లడి

బండికి కనీస పరిజ్ఞానం కూడా లేదంటూ ఘాటు విమర్శలు



హైదరాబాద్ ఆగస్టు 09 (సిద్దిపేట పవర్):

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తనపై చేసిన ఆరోపణలను 48 గంటల్లోగా వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బండి సంజయ్‌పై పరువునష్టం దావా వేసి కోర్టుకు ఈడుస్తానని కేటీఆర్ గట్టిగా హెచ్చరించారు. ఈ మేరకు త్వరలోనే ఆయనకు అధికారికంగా ..మిగతా 2లో

# ఆధారాలు చూపించు, లేదంటే క్షమాపణ చెప్పు

మొదటిపేజీ తరువాయి



లీగల్ నోటీసులు పంపనున్నట్లు స్పష్టం చేశారు.

కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాజకీయ లబ్ధి కోసమే తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలకు సంబంధించి ఒక్కటంటే ఒక్క ఆధారం ఉన్నా బయటపెట్టాలని సవాల్ విసిరారు. కేవలం తన ఢిల్లీ బాస్‌లను మెప్పించడం కోసమే బండి సంజయ్ ఇలాంటి వీధి డ్రామాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ తీరుపై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న వ్యక్తికి ఇంటెలిజెన్స్ పని తీరుపై కనీస అవగాహన అటుంచి, సాధారణ పరిజ్ఞానం కూడా లేదు. ఆయన వ్యాఖ్యలు హద్దులు మీరుతున్నాయి" అని విమర్శించారు. "ఢిల్లీ బాస్‌ల చెప్పులు మోసినంత సులభం కాదు బాధ్యతాయుతమైన మంత్రి పదవిని నిర్వహించడం," అంటూ ఎద్దేవా చేశారు. బండి సంజయ్ చేస్తున్న అసత్య ప్రచారాలు ఆయన స్థాయిని మరింత దిగజార్చుతున్నాయని కేటీఆర్ అభిప్రాయపడ్డారు.

## కేటీఆర్..! ఎక్కడికి రావాలో టైం, డేట్ చెప్పు

- కేటీఆర్ లీగల్ నోటీసుల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్న బండి సంజయ్
- చీకటి రహస్యాలు బయటపడతాయంటూ కేటీఆర్‌పై బండి సంచలన ఆరోపణలు
- ధైర్యం ఉంటే ముఖాముఖి చర్చకు రావాలంటూ కేటిఆర్‌కు సవాల్

హైదరాబాద్ ఆగస్టు 09 (సిద్దిపేట పవర్):

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వివాదం నేపథ్యంలో కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. కేటీఆర్‌ను ట్విట్టర్ టిల్లుగా సంబోధిస్తూ.. అక్రమాలను మర్చిపోయి లీగల్ నోటీసుల గురించి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. లీగల్ నోటీసుల వెనక దాక్కుంటూ మాట్లాడే నీకు ధైర్యం లేదని, గతంలో కూడా ఇదే ప్రయత్నం చేసి విఫలమయ్యావని సంజయ్ విమర్శించారు.

కేటీఆర్ చిల్లర చేష్టలకు తాను భయపడేది లేదని, ధైర్యం ఉంటే ముఖాముఖి చర్చకు రావాలంటూ సంజయ్ సవాల్ విసిరారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయని సంజయ్ అన్నారు. రాఖీ పండుగ నేపథ్యంలో కేటీఆర్ సొంత చెల్లెలు కూడా భయంతో పారిపోతోందని ఎద్దేవా చేశారు. ఆమె స్వయంగా ఫోన్ ట్యాపింగ్‌ను అంగీకరించిందని సంజయ్ అన్నారు.

48 గంటలు గడువు అంటున్నావ్ కానీ, నీ సమయం సమీపిస్తోందని, నీ చీకటి రహస్యాలు ఒక్కొక్కటిగా బయటపడతాయని అన్నారు. దాక్కోవడానికి కూడా కేటీఆర్‌కు ఎక్కడా చోటు ఉండదని సంజయ్ అన్నారు.

ఫోన్ ట్యాపింగ్ వివాదం నేపథ్యంలో కేటీఆర్, బండి సంజయ్ మధ్య రాజుకుంటున్న రాజకీయ, వ్యక్తిగత విమర్శలు ఎంత దూరం వెళ్తాయనేది ఆసక్తికరంగా మారింది.



## ట్రంప్ పుతిన్ చర్చలను స్వాగతించిన భారత్

- అమెరికా, రష్యా అధ్యక్షుల మధ్య కీలక సమావేశం
- ఆగస్ట్ 15న అలస్కాలో భేటీ కానున్న ట్రంప్, పుతిన్
- ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై చర్చించే అవకాశం
- భేటీని స్వాగతించిన భారత విదేశాంగ శాఖ
- రష్యా చమురు కొనుగోలుపై భారత్‌కు సుంకాల ఊరట లభించే ఛాన్స్
- సమావేశానికి ముందు ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడిన పుతిన్



అమెరికా ఆగస్టు 09 (సిద్దిపేట పవర్):

ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఆగస్ట్ 15న అలస్కాలో ఈ భేటీ జరగనున్నట్లు ట్రంప్ స్వయంగా ప్రకటించారు. గత కొంతకాలంగా ఉద్రిక్తంగా ఉన్న ఉక్రెయిన్ యుద్ధానికి ఈ సమావేశం ఒక ముగింపు పలుకుతుందని ప్రపంచ దేశాలు ఆశిస్తున్నాయి.

గత మూడు రోజులుగా చోటుచేసుకున్న వేగవంతమైన పరిణామాల అనంతరం ఈ భేటీ ఖరారైంది. "ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమావేశం ఆగస్ట్ 15, శుక్రవారం నాడు అలస్కాలో జరుగుతుంది" అని ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. ఈ సమావేశం భారత్‌కు కూడా ఎంతో కీలకం కానుంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు వాషింగ్టన్, భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాల భవిష్యత్తు ఈ భేటీతో తేలే అవకాశం ఉంది.

ఈ పరిణామాన్ని భారత్ మనస్ఫూర్తిగా స్వాగతించింది. అమెరికా, రష్యా మధ్య కుదిరిన ఈ అవగాహనను అభినందిస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. "ఈ సమావేశం ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికి, శాంతికి అవకాశాలు కల్పిస్తుందని ఆశిస్తున్నాం. ప్రధాని నరేంద్ర మోదీ అనేకసార్లు చెప్పినట్లుగా 'ఇది యుద్ధాల యుగం కాదు'" అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఈ శాంతి ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

శిఖరాగ్ర సమావేశానికి ముందు రష్యా అధ్యక్షుడు పుతిన్, ప్రధాని నరేంద్ర మోదీతో శుక్రవారం సాయంత్రం ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ అంశంపై అమెరికాతో జరిగిన చర్చల వివరాలను ఆయన మోదీకి వివరించారు. భారత్‌రష్యా మధ్య ఉన్న ప్రత్యేక భాగస్వామ్యం దృష్ట్యా, అమెరికా అధ్యక్షుడి ప్రత్యేక దూత స్టీవెన్ విట్కాఫ్‌తో జరిగిన సమావేశంలోని కీలక అంశాలను పుతిన్ పంచుకున్నారని రష్యా అధ్యక్ష కార్యాలయం తెలిపింది. పుతిన్ అందించిన వివరాలకు ధన్యవాదాలు తెలిపిన ప్రధాని మోదీ, వివాదానికి శాంతియుత పరిష్కారం కనుగొనాలన్నదే భారత్ స్థిరమైన వైఖరి అని పునరుద్ఘాటించారు.

ఈ సమావేశానికి ట్రంప్ ప్రత్యేక దూత స్టీవెన్ విట్కాఫ్, పుతిన్‌తో మాస్కోలో జరిపిన చర్చలే పునాది వేశాయి. ఈ చర్చల అనంతరం ట్రంప్ మాట్లాడుతూ, పుతిన్‌తో సానుకూల చర్చలు జరిగాయని, శాంతి నెలకొనేందుకు మంచి అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. "ఇరు దేశాల ప్రయోజనాల కోసం కొన్ని భూభాగాల మార్పిడి కూడా ఉండొచ్చు" అని ట్రంప్ వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది.

# ఈసీ సంచలనం.. 334 రాజకీయ పార్టీలపై వేటు

- గత ఆరేళ్లుగా ఒక్క ఎన్నికలోనూ పోటీ చేయకపోవడమే కారణం
- రిజిస్టర్డ్ చిరునామాల్లోనూ కనిపించని పార్టీ కార్యాలయాలు
- ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా ఈసీ కీలక నిర్ణయం
- తాజా చర్యతో 2,520కి తగ్గిన గుర్తింపు లేని పార్టీల సంఖ్య
- దేశంలో 6 జాతీయ, 67 రాష్ట్ర పార్టీలు ఉన్నాయని వెల్లడి

హైదరాబాద్ ఆగస్టు 09 (సిద్దిపేట పవర్):

దేశంలోని రాజకీయ వ్యవస్థ ప్రక్షాళన దిశగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. గత ఆరేళ్లుగా కనీసం ఒక్క ఎన్నికలో కూడా పోటీ చేయని, క్రియారహితంగా ఉన్న 334 రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తున్నట్లు శనివారం అధికారికంగా ప్రకటించింది. కేవలం కాగితాలకే పరిమితమైన ఈ పార్టీలపై వేటు వేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంచాలని ఈసీ లక్ష్యంగా పెట్టుకుంది.

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, రిజిస్టర్ అయిన పార్టీలు క్రమం తప్పకుండా ఎన్నికల్లో పోటీ చేయాల్సి ఉంటుంది. అయితే, 2019 నుంచి ఇప్పటివరకు ఈ 334 పార్టీలు ఏ ఎన్నికలోనూ తమ అభ్యర్థులను నిలబెట్టలేదు. అంతేకాకుండా, ఈ పార్టీలు రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చిన చిరునామాలలో వాటి కార్యాలయాలు భౌతికంగా లేవని క్షేత్రస్థాయి పరిశీలనలో తేలిందని ఈసీ స్పష్టం చేసింది. ఈ రెండు కీలక నిబంధనలను పాటించడంలో విఫలమైనందుకే వాటి గుర్తింపును రద్దు చేసినట్లు వివరించింది.




ఈ ప్రక్షాళన చర్యకు ముందు దేశంలో మొత్తం 2,854 రిజిస్టర్డ్ గుర్తింపు లేని పార్టీలు ఉండేవి. తాజా నిర్ణయంతో 334 పార్టీలను జాబితా నుంచి తొలగించగా, ప్రస్తుతం వాటి సంఖ్య 2,520కి తగ్గింది. ఈ చర్య దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నమోదైన పార్టీలకు వర్తిస్తుంది.

అయితే, ఈ నిర్ణయం కేవలం గుర్తింపు లేని, క్రియారహితంగా ఉన్న పార్టీలకు మాత్రమే వర్తిస్తుందని ఈసీ తెలిపింది. ప్రస్తుతం దేశంలో చురుకుగా ఉన్న 6 జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర స్థాయి పార్టీల కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. ఎన్నికల వ్యవస్థలో జవాబుదారీతనం పెంచేందుకు భవిష్యత్తులోనూ ఇలాంటి చర్యలు కొనసాగుతాయని ఎన్నికల సంఘం వర్గాలు సూచించాయి.

## సినీ కార్మికుల సమ్మె.. కానరాని పరిష్కారం!

- సినీ పరిశ్రమలో కొనసాగుతున్న కార్మికుల సమ్మె
- ఆరో రోజుకు చేరిన సినీ కార్మికుల సమ్మె..
- కనపడని పరిష్కారం!

హైదరాబాద్ ఆగస్టు 09 (సిద్దిపేట పవర్):

సినీ పరిశ్రమలో కొనసాగుతున్న కార్మికుల సమ్మె ఆరో రోజుకు చేరింది. అయినా కానీ కార్మికుల డిమాండ్స్ ఇంకా ఓ కొలిక్కి రాలేదు. ఇది ఇలా ఉండగా.. నిర్మాత టీ.జి. విశ్వప్రసాద్ ఫెడరేషన్ నాయకులపై పెట్టిన కేసులతో పరిస్థితి మళ్లీ మొదటి దశకు చేరింది. నిర్మాతలకు, ఫెడరేషన్ వారికి మధ్య సయోధ్య కల్పించేందుకు కోఆర్డినేషన్ కమిటీ ప్రయత్నాలు చేస్తున్నా, పరిష్కారం కనిపించడం లేదు.

శుక్రవారం నాడు సినీ నిర్మాతలకు ఫిల్మ్ ఛాంబర్ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఫిల్మ్ ఫెడరేషన్ ఏకపక్ష నిర్ణయాలతో సమ్మెకు పిలుపునిచ్చిందని.. కాబట్టి ఫెడరేషన్ సంఘాలతో ఎవరూ సంప్రదింపులు చేయరాదని సూచించింది. దీనితో స్టూడియో, అవుట్‌డోర్ యూనిట్ సభ్యులు ఫెడరేషన్ వారికి ఎలాంటి సేవలు అందించకూడదని, ఛాంబర్ తదుపరి ఆదేశాలు వచ్చే వరకు షూటింగ్స్ జరపవద్దని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే వేతనాల పెంపును సమ్మతిస్తూ షూటింగ్స్ కొనసాగిస్తున్న దాదాపు 12 సినిమాలున్నాయి. అయితే ఛాంబర్ అనుమతి లేకుండా, ఫెడరేషన్ అనుమతితో షూటింగ్స్ చేస్తున్న నిర్మాతలపై ఫిల్మ్ ఛాంబర్ అసహనం వ్యక్తం చేసింది. ఈ ఆదేశాలతో మొత్తం షూటింగ్స్ ఆగిపోనున్న పరిస్థితి నెలకొంది.

ఈరోజు ఫిల్మ్ ఫెడరేషన్ అనుబంధ కార్మిక సంఘాల సమావేశం జరగనుంది. ఇందులో ఆదివారం జరగనున్న సినీ కార్మికుల ధర్నాపై చర్చించనున్నారు. అలాగే ఈరోజే మంత్రి కోమటిరెడ్డిని ఫెడరేషన్ నాయకులు కలిసే అవకాశం ఉంది. కార్మికుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్న నమ్మకం ఉన్న సమయంలో నిర్మాత టీ.జి. విశ్వప్రసాద్ ఫెడరేషన్ నాయకులపై కేసులు పెట్టడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. టీ.జి. విశ్వప్రసాద్ తీరు పట్ల సినీ కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 4 ప్రతిపాదనలపై ఫెడరేషన్ నిర్ణయం చెబితేనే వేతన పెంపుపై ఒక నిర్ణయం తీసుకుంటామని నిర్మాతలు స్పష్టం చేశారు. ఇకపోతే ఆదివారం నాడు ఫెడరేషన్ ఆఫీస్ నుంచి ఫిల్మ్ ఛాంబర్ వరకు సినీ కార్మికులు ధర్నా నిర్వహించనున్నారు. ఈ సమ్మె ఏ దిశగా వెళ్తుందో, పరిష్కారం ఎప్పుడు లభిస్తుందో సినీ వర్గాలు ఆతృతగా ఎదురుచూస్తున్నాయి.




## ఏది అక్రమం.. ఏది సక్రమం?..

మొదటిపేజీ తరువాయి

కంపెనీకి నోటీసులు కూడా జారీ అయ్యాయని తెలిపారు.

వచ్చే వారం హైకోర్టులో విచారణకు రానుందని పేర్కొన్నారు. అధికార పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలం కలిసి ఫిర్యాదులు చేయడంతో పాటు కోర్టులో పిల్ వేశామంటేనే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ప్రాజెక్టులో ప్లాట్లు కొనుగోలు చేయొద్దని అనిరుధ్ కోరారు. అది ప్రభుత్వ భూమిగా నిర్ధారణ జరిగితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, సదరు నిర్మాణ సంస్థ చేతులెత్తేస్తుందని హెచ్చరించారు. చెల్లించిన డబ్బులు కూడా తిరిగి ఇవ్వదని, అందుకే కొనుగోలుదారులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీంతో అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి.

**ఆది నుంచి సర్కారు తీరింతే**

కేవలం ఖాజాగూడ అంశంలోనే కాదు, గోపన్‌పల్లిలోనూ ప్రభుత్వ తీరు ఇట్లనే తయారైంది. గతంలో సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సచివాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించి రూ.15 వేల కోట్ల విలువైన 11 నిర్మాణ ప్రాజెక్టులు అక్రమమని తేల్చి చెప్పారు. కానీ ఆ ప్రాజెక్టు పనులను మాత్రం నిలిపివేయలేదు. ఒకవైపు అక్రమమంటూనే, మరోవైపు నిర్మాణాలను అడ్డుకోకుంటే ప్రజలు ఏది నమ్మాలి? కొనాలా, వద్దా అనేది తేల్చుకోలేక కొనుగోళ్లనే వాయిదా వేస్తున్నారు. ఆ పరిణామాలతో రియల్‌నిర్మాణ రంగం కుదేలవుతున్నది. మరోవైపు, ప్రభుత్వ భూముల్లో వెలసిన నిర్మాణాలంటూ గతంలో అనుమతులు ఉన్న, హైకోర్టు స్టేటస్ కో ఉన్న నిర్మాణాలను సైతం హైడ్రా క్షణాల్లో కుప్పకూల్చింది. కానీ మ్యాన్‌హట్టన్ ప్రాజెక్టు విషయంలో మాత్రం అది టైటిల్ డిస్ప్యూట్ (యాజమాన్య హక్కు వివాదం) అంటూ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. పైగా గత ప్రభుత్వ హయాంలో కలెక్టర్ క్లియరెన్స్ ఇచ్చారని చెప్తున్నారు. వాస్తవానికి గతంలో కలెక్టర్ క్లియరెన్స్ ఇచ్చినప్పటికీ అదే ప్రభుత్వ హయాంలో సీసీఎల్‌ఏ కమిషనర్ వాటిని రద్దు చేసిన విషయాన్ని మాత్రం దాచి పెడుతున్నారు. ఈ నేపథ్యంలో అది ప్రభుత్వ భూమి అని ఇప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో ఉన్నా చర్యలకు మాత్రం అనేకరకాల సాకులు చూపుతున్నారు.

ఇది రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ సర్వే నంబరు 27లోని 27.18 ఎకరాల ప్రభుత్వ భూమి. ఒక నిర్మాణ సంస్థ 'మ్యాన్‌హట్టన్' పేరుతో ప్రాజెక్టు చేపట్టింది. 59 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏడు టవర్ల పనులు కొనసాగుతున్నాయి. ఇది ప్రభుత్వ భూమి కావడంతో అధికార పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు హైడ్రా, ఇతర విభాగాలకు ఫిర్యాదు చేశారు. చివరకు హైకోర్టులో పిల్ కూడా వేశారు. అంతజరిగినా ప్రభుత్వం స్పందించలేదు. అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో పనులు రికాం లేకుండా కొనసాగుతూనే ఉన్నాయి. ఆ నలుగురు ఎమ్మెల్యేల్లో ఒకరైన అనిరుధ్‌రెడ్డి తాజాగా గాంధీభవన్ వేదికగా ఓ ప్రకటన చేశారు. ఆ ప్రాజెక్టులో ప్లాట్లు ఎవరూ కొనవద్దని హెచ్చరించారు. ప్రభుత్వం అన్నిరకాల అనుమతులిచ్చిన ఆ ప్రాజెక్టును.. అధికార పార్టీ ఎమ్మెల్యేనే అక్రమ ప్రాజెక్టు అంటున్నారు. ఇంతకీ అది అక్రమమా? సక్రమమా?


ఇది కూడా శేరిలింగంపల్లి మండలంలోని గోపన్‌పల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 36లో వెలసిన అక్రమ లేఅవుట్. గతంలో ఈ ప్రభుత్వ భూమిని తమ ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వమే కేటాయించగా, ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించారంటూ ప్రభుత్వ ఉద్యోగులు (భాగ్యనగర్ టీఎన్జీవోలు) నిరసన దీక్షలు చేస్తున్నారు. రంగారెడ్డి కలెక్టర్ బాజాప్తా ఈ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ పంపారు. దీన్ని అడ్డం పెట్టుకొని ప్రైవేటు వ్యక్తులు కొన్నిరోజులుగా పెద్ద ఎత్తున మార్కెటింగ్ చేసి ప్లాట్లను విక్రయిస్తున్నారు. చివరకు హైకోర్టును ఆశ్రయించగా స్టే వచ్చిందని ప్రభుత్వ ఉద్యోగులు చెప్తున్నారు. ప్రభుత్వం మాత్రం స్పందించదు. ఈ లేఅవుట్ అక్రమమో, సక్రమమో అధికారులు ప్రకటించరు. మరి ఇందులో ప్లాట్లు కొనుగోలు చేసే సామాన్యుడి పరిస్థితి ఏమిటి?



## అది దేవస్థానమా లేక శ్మశానమా?

- తవ్వేకొద్దీ ఎముకలు, పుర్రెలు బయటపడుతున్నాయి..
- కలకలం రేపుతున్న ధర్మస్థల మిస్టరీ హత్యలు
- 500 మంది అమ్మాయిలపై హత్యాచారం చేసి పూడ్చి పెట్టారన్న నారాయణ
- ట్రస్ట్ ఛైర్మన్, సభ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్

హైదరాబాద్ ఆగస్టు 09 (సిద్దిపేట పవర్):



ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మస్థలలో మిస్టరీ హత్యలు కలకలం కేపుతున్నాయి. ఈ అంశంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దాదాపు 500 మంది అమ్మాయిలపై లైంగిక దాడులు చేసి, హత్య చేసి పూడ్చి పెట్టారని ఆయన ఆరోపించారు. ధర్మస్థల ట్రస్ట్ ఛైర్మన్, సభ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ధర్మస్థల ట్రస్ట్ ఒక కుటుంబం చేతిలో ఉందని నారాయణ తెలిపారు. ట్రస్ట్ కు ప్రతి ఏడాది రూ. 100 కోట్ల ఆదాయం వస్తుందని చెప్పారు. ట్రస్ట్‌ను ఎండోమెంట్ విభాగం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. 500 మందిపై హత్యాచారం చేసి పూడ్చిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తవ్వేకొద్దీ ఎముకలు, పుర్రెలు బయటపడుతున్నాయని చెప్పారు. అది దేవస్థానమా లేక శ్మశానమా? అని ప్రశ్నించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి సిట్ వేశారని... అదే వేరే ప్రభుత్వం ఉంటే అసలు ఈ విషయం బయటకు వచ్చేది కాదని అన్నారు.

## రేవంత్ రెడ్డితో విభేదాలు ఉన్నాయనే వార్తలపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందన

- అవన్నీ తప్పుడు వార్తలన్న పీసీసీ చీఫ్
- రేవంత్ తో మంచి అనుబంధం ఉందని వ్యాఖ్య
- బీసీ వ్యక్తి తెలంగాణ సీఎం కావడం ఖాయమని ధీమా

హైదరాబాద్ ఆగస్టు 09 (సిద్దిపేట పవర్):



సీఎం రేవంత్ రెడ్డితో తనకు విభేదాలు ఉన్నాయని సోషల్ మీడియాలో కొందరు ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆ ప్రచారంలో నిజం లేదని... అవన్నీ తప్పుడు వార్తలని చెప్పారు. రేవంత్ కు, తనకు మధ్య మంచి అనుబంధం ఉందని తెలిపారు. తమ మధ్య ఉన్న సత్సంబంధాల వల్లే బీసీ రిజర్వేషన్లపై పోరాటం చేయగలిగామని చెప్పారు.

బీజేపీ నేతలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్ ల మౌనం బీసీలకు అన్యాయం చేస్తుందని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి తెలంగాణ ముఖ్యమంత్రి కావడం ఖాయమని జోస్యం చెప్పారు.

# డమ్మీ వర్సిటీ.. ఫేక్ కోర్సులు?

**దేశంలోనే అత్యున్నత యూనివర్సిటీల్లో ఒకటైన జేఎన్టీయూ తప్పటడుగులు వేస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ఫారిన్ కోర్సుల పేరుతో ఓ నకిలీ విద్యాసంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఆరోపిస్తున్నారు. జేఎన్టీయూ ఇటీవలే జర్మనీకి చెందిన రోట్లింజన్ నాలెడ్జ్ ఫౌండేషన్ యూనివర్సిటీ (కేఎఫ్ఆర్‌యూ)తో ఎంవోయూ కుదుర్చుకున్నది. అయితే అది నకిలీ వర్సిటీ అంటూ జర్మనీలోని తెలుగు పౌరులు, విద్యావేత్తలు తదితరులు జేఎన్టీయూకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. అసలు రోట్లింజన్ వర్సిటీకి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినా జేఎన్టీయూ అధికారులు మాత్రం అప్రమత్తం కావడం లేదని విద్యావేత్తలు మండిపడుతున్నారు.**

- **జర్మనీ సంస్థతో ఎంవోయూలో జేఎన్‌టీయూ తప్పటడుగులు**
- **ఒక్క చర్యతో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థకు మరక**
- **కేఎఫ్ఆర్‌యూ సంస్థతో ఎంవోయూపై దుమారం**
- **రెండు ఫారిన్ కోర్సుల్లో విద్యార్థులకు అడ్మిషన్లు**
- **జర్మనీ లోని టాప్-3 వర్సిటీ అంటూ ప్రచారం**
- **అది ఫౌండేషనే.. వర్సిటీ కాదంటూ ఫిర్యాదులు**
- **అయినా స్పందించని జేఎన్‌టీయూ అధికారులు**
- **అలాగే ముందుకెళ్తే విద్యార్థులకు తీవ్ర నష్టమే!**

**హైదరాబాద్ ఆగస్టు 04 (సిద్దిపేట పవర్):**

ఇటీవలే జర్మనీకి చెందిన 'రోట్లింజన్ నాలెడ్జ్ ఫౌండేషన్ యూనివర్సిటీ'(కేఎఫ్ఆర్‌యూ) పేరుతో జేఎన్టీయూ కుదుర్చుకున్న ఒప్పందం దుమారం రేపుతున్నది. నకిలీ విద్యాసంస్థతో ఎంవోయూ కుదుర్చుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనేక ఆరోపణలు వస్తున్నా.. వర్సిటీ అధికారులు పట్టనట్టే వ్యవహరిస్తున్నారు. మొండిగా ముందుకెళ్తే, విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ సర్టిఫికెట్లు చెల్లుబాటు కాకపోతే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై జేఎన్టీయూ రిజిస్ట్రార్ కే వెంకటేశ్వర్‌రావును 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన జేఎన్టీయూ అకడమిక్ డైరెక్టర్ ఫోన్ నంబర్లను సంప్రదిస్తే కౌన్సిలర్లు బదులిస్తున్నారు. జేఎన్టీయూ ఇటీవలే జర్మనీకి చెందిన రోట్లింజన్ నాలెడ్జ్ ఫౌండేషన్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నది.

ఇందులో భాగంగా ఐదున్నరేండ్ల ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్ అండ్ మాస్టర్స్, ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ ఇన్ ప్రొఫెషనల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ (ఐఐబీఎంపీ), రెండేండ్ల ఇంటర్నేషనల్ మాస్టర్స్ ప్రోగ్రామ్ (ఐఎంపీ) కోర్సులు నిర్వహించనున్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ తుది దశకు చేరుకున్నది. అయితే జర్మనీలో 'రోట్లింజన్ హోప్ షూ లే' అనే యూనివర్సిటీ కూడా ఉన్నది. ఈ వర్సిటీకి రోట్లింజన్ నాలెడ్జ్ ఫౌండేషన్‌కు ఎలాంటి సంబంధం లేదని ఇటీవలే కొందరు జేఎన్టీయూకు మెయిల్ ద్వారా ఫిర్యాదుచేశారు. జర్మన్ అకడమిక్ ఎక్స్చేంజ్ సర్వీస్ 'డాడ్'లో కూడా కేఎఫ్ఆర్‌యూ నమోదుకాలేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఒకే పేరు ఉండటంతో ఫౌండేషన్‌నే వర్సిటీగా భావిస్తున్నారంటూ వివరణ ఇచ్చారు. జేఎన్టీయూకు ఫౌండేషన్‌కు, వర్సిటీకి మధ్య తేడా కూడా తెలియదా? అని ప్రశ్నించారు.

**జేఎన్టీయూలోనే గందరగోళం**

'రోట్లింజన్' అనేది జర్మనీలోని ఒక ప్రాంతం. 'హోప్ షూ లే' అంటే జర్మనీలోని ఒక యూనివర్సిటీ. నిజమైన 'రోట్లింజన్ హోప్ షూ లే' యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో జేఎన్టీయూతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఎక్కడా లేదు. జేఎన్టీయూ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో 'నాలెడ్జ్ ఫౌండేషన్ ఆఫ్ రోట్లింజన్ యూనివర్సిటీ జర్మనీ' అని పొందుపరిచారు. జేఎన్టీయూ వెబ్‌సైట్‌లోని ఇన్ఫర్మేషన్ బుక్‌లెట్‌లో 'రోట్లింజన్ యూనివర్సిటీ ఆఫ్ అప్లయిడ్ సైన్స్' అని పేర్కొన్నారు. మరోచోట 'రోట్లింజన్ నాలెడ్జ్ ఫౌండేషన్ యూనివర్సిటీ (కేఎఫ్ఆర్‌యూ)' అని ప్రచురించారు. ఇది తీవ్రగందరగోళానికి దారి తీస్తున్నది. మూడింటిలో ఏ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. విద్యావేత్తలు, తల్లిదండ్రులు కూడా ఇదే అంశంపై జేఎన్టీయూ హెల్ప్‌లైన్లకు ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారు. అయినా వర్సిటీ వర్గాల నుంచి సరైన సమాధానం రావడం లేదు. వాస్తవానికి యూరోపియన్ చట్టాల ప్రకారం యూరప్ ఖండం వారెవరైనా జర్మనీలో విద్యాసంస్థలు పెట్టుకోవచ్చు. వ్యాపారం చేసుకోవచ్చు. బల్గేరియా వంటి చిన్న దేశాల్లో విద్యా సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకుని జర్మనీలో శాఖలను తెరుస్తుంటాయి. ఈ ఫౌండేషన్ కూడా అదే కోవకు చెందినదై ఉంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆన్‌లైన్‌లో రోట్లింజన్ నాలెడ్జ్ ఫౌండేషన్ వర్సిటీకి, రోట్లింజన్ హోప్ షూ లే వర్సిటీకి సంబంధం లేదని స్పష్టం అవుతున్నది.




## ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

**చేర్యాల, ఆగస్టు 9 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండల పార్టీ అధ్యక్షులు భూమని బాలరాజు ఆధ్వర్యంలో ఈ రోజు చేరియాల పట్టణకేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు చెట్కూరి కమలాకర్,జిల్లా ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు,AYC ప్రెసిడెంట్ కర్క సంతోష్ రెడ్డి మండల అధ్యక్షుడు భూమని బాలరాజ్ పట్టణ అధ్యక్షులతో కలిసి ఘనంగా నిర్వహించడం జరిగింది..ఈ సందర్భంగా అందె నాని బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను జిల్లా వ్యాప్తంగా ప్రతి గడప గడపకు ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత మనందరం కలిసి తీసుకోవాలని మరియు దేశంలో బిజెపి ఈసీ లు రెండు కుమ్మక్కై కర్ణాటకలో మహాదేవపుర లో, 100250, ఓట్లు మాయమయ్యాయని, మహారాష్ట్రలో సింగిల్ బెడ్ రూమ్ ఇంట్లో 42 ఓట్లు ఉన్నాయి, 0 ఇంటి నెంబర్తో వందల ఓట్లు ఉన్నాయి , ప్రజలు నిజం తెలుసుకోకుండా ఉండడానికి ఈ రోజు ఎన్నికల సంఘం తన వెబ్ సైట్ ని మూసివేసింది, దేశంలో ఓట్ల దొంగతనం చేసిన బిజెపిని త్వరలోనే గద్దె దించుదామని తెలిపారు..



# గిరిజనం.. గరం గరం!..

**మొదటిపేజీ తరువాయి**

సందర్భంగా రాష్ట్రంలోని ఆదివాసీ, గిరిజనులకు కాంగ్రెస్ అనేక హామీలను ఇచ్చింది. వాటిని చేవేళ్ల డిక్లరేషన్‌గా ప్రకటించింది. ఆదివాసీ గూడాలను, లంబాడీ తండాలను ప్రత్యేక పంచాయతీలుగా, రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తిస్తామని, రాష్ట్ర బడ్జెట్‌లో బంజారాలకు, ఆదివాసీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తామని, గూడేలు, తండా డెవలప్మెంట్‌కు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేస్తామని హామీల వర్షం కురిపించింది. అంబేద్కర్ అభయ హస్తం కింద జీవనోపాధి కోసం ఆదివాసీ, గిరిజనులకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని నమ్మబలికింది. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఎస్టీలకు స్థలం ఇవ్వడంతోపాటుగా, రూ. 6 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని, ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో 12 శాతం కేటాయిస్తామని, ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్, ఎస్టీ విద్యార్థులు పది పాసయితే రూ. 10 వేలు, ఇంటర్ పూర్తిచేస్తే 15 వేలు, డిగ్రీ పూర్తిచేస్తే రూ. 25 వేలు, పీజీ పూర్తిచేస్తే రూ.లక్ష, ఎంఫిల్, పీహెచ్‌డీ చేస్తే రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని హామీలతో ఊదరగొట్టింది. కానీ 20 నెలలైనా ఏ ఒక్క హామీని కాంగ్రెస్ పార్టీ నెరవేర్చలేదు.

**ఉన్న పథకాలకూ మంగళం**

ఇచ్చిన హామీ సంగతేమో కానీ ఉన్నవాటికీ కాంగ్రెస్ సర్కారు మంగళం పాడుతున్నది. అందుకు ట్రైకార్ నిదర్శనంగా నిలుస్తుంది. గిరిజనులకు స్వయం ఉపాధి కోసం ట్రైకార్ ద్వారా రుణాలను పంపిణీ చేస్తారు. కానీ కాంగ్రెస్ సర్కారు దీనిని పూర్తిగా నిలిపేసింది. రాజీవ్ యువ వికాసం పథకం అంటూ ఉన్న ట్రైకార్‌ను నిర్వీర్యం చేసేందుకు సిద్ధమైంది. ఇదిలా ఉంటే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ట్రైకార్ సంస్థ ద్వారా 20192021 సంవత్సరాల్లో గిరిజన యువతీయువకుల నుంచి సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తులను స్వీకరించింది. అందులో 30 వేలని లబ్ధిదారులుగా గుర్తించిందని, వారికి అందించేందుకు 219 కోట్ల చెకులను సిద్ధం చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపిందని వెల్లడించారు.

**ఆదివాసీ, గిరిజన సంఘాల ఆగ్రహం**

కాంగ్రెస్ పార్టీ తీరుపై ఆదివాసీ, గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం 3000 వేలకు పైగా నూతన గిరిజన గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసిందని, జనాభా దామాషా ప్రకారం 6 శాతంగా ఉన్న గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచిందని, సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించారని, అందుకు ఏటా రూ. కోటి నిధులను కేటాయించారని గుర్తుచేస్తున్నాయి. హైదరాబాద్ నడిబొడ్డున సేవాలాల్ మహారాజ్ పేరు మీద బంజారా భవన్ ఎకరా స్థలంలో రూ.50 కోట్లతో నిర్మించి లంబాడీల ఆత్మగౌరాన్ని నిలిపారని, లంబాడీల భాష గోర్‌బోలిని 8వ షెడ్యూల్లో చేర్చడం, అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం సహా ఎన్నో సమస్యలను గత ప్రభుత్వం పరిష్కరించింది. కానీ కాంగ్రెస్ సర్కారు అడుగడుగునా అవమానాలకు గురిచేయడంపై భగ్గుమంటున్నాయి. పోరుబాటకు సిద్ధమయ్యాయి. ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నాయి.



**గిరిపుత్రులపై అడుగడుగునా ఉక్కుపాదం**

పథకాల అమలు సంగతేమో కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గిరిపుత్రులపై ఉక్కుపాదం మోపుతున్నది. ఆదివాసీలకు పోడు పట్టాలను పంపిణీ చేస్తామని, ప్రభుత్వ అవసరాలకు భూమిని సేకరిస్తే పట్టా భూములకు సమానంగా పరిహారం చెల్లిస్తామని నమ్మబలికిన హస్తం పార్టీ అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. రాష్ట్రంలో ప్రభుత్వానికి ఏ అవసరం వచ్చినా ముందుగా లంబాడీలు, ఆదివాసీల భూములను గుంజుకోవడం పరిపాటిగా మారింది. అందుకు లగచర్ల నిలువెత్తు నిదర్శనం. అంతేకాదు ఆదివాసీలకు మరో ముప్పును తెచ్చిపెట్టింది. కొమురం భీం కన్జర్వేషన్ కారిడార్ పేరిట జీవో 49ను తీసువచ్చింది. ఐదో షెడ్యూల్ ప్రాంతానికి సంబంధించి రాజ్యాంగంలో పొందుపరిచిన 1/70, పెసా చట్టాలను, ఆదివాసీల అస్తిత్వాన్ని, సంస్కృతీ సంప్రదాయాలను, ఆదివాసీల హకులను కాలరాస్తూ ఎలాంటి గ్రామసభ తీర్మానాలు లేకుండానే జీవో 49ను తీసుకువచ్చింది. ఆదివాసీలు వ్యతిరేకించడంతో స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తాత్కాలికంగా ఆ జీవో అమలును నిలిపివేసిందే తప్ప ఇప్పటికీ రద్దు చేయలేదు.

## గాంధీ వైద్యులకు రాఖీలు కట్టిన చిన్నారులు

**సికింద్రాబాద్, ఆగస్ట్ 09 ( సిద్దిపేట పవర్ ) :**

రాఖీ పౌర్ణమి సందర్భంగా గాంధీ ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యులు నర్సులు, పోలీసులు, సిబ్బంది, రోగులు, వారి సహాయకులకు చిన్నారులు రాఖీలు కట్టారు. జనహిత సేవా ట్రస్ట్,జానకి జీవన్ ఇంటలెక్చువల్లీ ఛాలెంజ్ డ్ స్కూల్ విద్యార్థులు, వాత్సల్య సింధు ఆశ్రమం, వైదేహి ఆశ్రమానికి చెందిన చిన్నారులు కలిసి శనివారం ఆస్పత్రిలో సుమారు 800 మందికి రాఖీలు కట్టారు. వారికి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ రోజున కుటుంబానికి దూరంగా విధి నిర్వహణలో ఉన్న వారికి రక్షాబంధన్ రోజున రాఖీలు కట్టడం వలన వారు ఎంతో సంతోషపడ్డారని, ఈ కార్యక్రమాన్ని తాము ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు జనహిత సేవా ట్రస్టు,మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి తెలిపారు.






## రైతు బీమా నమోదు..

- **అర్హత గల రైతులు త్వరగా నమోదు చేసుకోవాలి..**
- **జిల్లాలో రైతు బీమా గురించి 8 వ పాలసీ సంవత్సరం అంటే 2025వ సంవత్సరం 14.08. 2025 నుండి ప్రారంభం**
- **జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి..**

**సిద్దిపేట, పవర్ ఆగస్ట్ 9:**

జిల్లాలో 2025 రైతు బీమా పాలసీ సంవత్సరం ఆగస్టు 14, 2025 నుండి ఆగస్టు 13, 2026 వరకు అమలులో ఉంటుంది అని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ బీమాకు 18 సంవత్సరాల కంటే ఎక్కువ, 59 సంవత్సరాల కంటే తక్కువ వయసు గల రైతులు మాత్రమే అర్హులు అంటే 14.08.1966 మరియు 14.08.2007 మధ్య జన్మించిన రైతులు మాత్రమే ఈ పథకంలో చేరవచ్చు అని తెలిపారు. పుట్టిన తేదీ ఆధార్ కార్డు ఆధారంగానే పరిగణించబడుతుంది అని బీమా నమోదు కోసం రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, రైతు మరియు జీవిత భాగస్వామి ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలతో తమ వ్యవసాయ విస్తరణ అధికారులు (AEO) ను స్వయంగా సంప్రదించాలన్నారు.2025 జూన్ 5 నాటికి కొత్త పట్టాదారు పాస్‌బుక్స్ పొందిన రైతులు 2025 పాలసీ సంవత్సరానికి నమోదు కోసం ఆగస్టు 13, 2025 లోపు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలి. ఇప్పటికే నమోదు చేసుకున్న రైతులు లేదా ఏవైనా సవరణలు అవసరమైతే ఆగస్టు 12, 2025 లోపు ఆధార పత్రాలతో AEO లేదా MAO లను సంప్రదించి రైతులు సమయానికి నమోదు చేసుకుని, రైతు బీమా సదుపాయం పొందాలని సూచించారు.



## నా జోలికి వస్తే ఊరుకునేది లేదు బిడ్డ శ్రీనివాస్ రెడ్డి

- **ఎస్సీ ఎస్టీ కమిషనర్ చైర్మన్ బక్కి వెంకటయ్య సవాల్**
- **దళిత మంత్రుల పై మొసలి కన్నీరు....**
- **సామాన్యుడైన నా పై విషం కక్కుతావా...**
- **ద్వంద విధానాలు మానుకో...**
- **చెరుకు శ్రీ నివాస్ రెడ్డి కి రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచన.**



**దుబ్బాక సిద్దిపేట పవన్ ఆగస్టు 9 ప్రతినిధి**

దళిత మంత్రుల పై అరోపణలను ఖండిస్తూ మొసలి కన్నీరు కారుస్తు సామాన్యుడైన రాజ్యాంగ బద్ద పదవిలో వున్న నా పై విషం కక్కడం దుబ్బాక కాంగ్రెస్ ఇన్ చార్జి చెరుకు శ్రీ నివాస్ రెడ్డి కి అలవాటుగా మారిందని ఇది బావ్యం కాదని రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కమిషన్ చైర్మన్ గా దుబ్బాక ఎమ్మెల్యే తోనే కాదు ముఖ్యమంత్రి,మంత్రులు,ఎమ్మెల్యే లతో కలిసి పర్యటిస్తామని తెలిపారు. రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ పనితీరును రాష్ట్ర ముఖ్యమంత్రి బాగా పని చేస్తున్నారని కితాబు ఇచ్చారని,చెరుకు శ్రీ నివాస్ రెడ్డి కి మాత్రం కమిషన్ పనితీరు కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు._సిద్దిపేట జిల్లా ఇన్ చార్జి మంత్రి వివేక్ వెంకట స్వామితో కలిసి రెషన్ కార్డుల పంపిణీలో, జిల్లా సమీక్ష లో,గవర్నర్ పర్యటనలో కమిషన్ చైర్మన్ గా పాల్గొన్న విషయాన్ని మరిచిపోయి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పర్యటనలో పాల్గొనడాన్ని భూతద్దంలో చూపడం తగదన్నారు. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ ల పై ఎక్కడ దాడి జరిగిన అక్కడికి వెళ్ళి కమిషన్ అండగా నిలుస్తుందన్నారు._ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ గా పదవిలో ఉండి బడుగు బలహీన వర్గాల కోసం ప్రతినిత్యం శ్రమిస్తున్న బక్కి వెంకటయ్య పై నింద మోపడం సరికాదని హెచ్చరించారు._ చెరుకు శ్రీ నివాస్ రెడ్డి బాష పదజాలం వల్ల తన తండ్రి మా గురువు ముత్యంరెడ్డి అత్మ క్షోబిస్తుదన్నారు. రాజకీయ భవిష్యత్తు శ్రీ నివాస్ రెడ్డికి చాలా వుందని నీ కంటె వయస్సు లో పెద్దయిన నా లాంటి వారిని నొటికి వచ్చినట్లు విమర్శిస్తే తగదని హెచ్చరించారు. నీ బాష వల్ల సభ్య సమాజం విస్తుపొతుందని వాపొయారు. నా జొలికి వస్తే చూస్తు ఊరుకొనని హితువు పలికారు.

## ఆడబిడ్డల ఆర్థిక సాధికారతే అసలైన రక్షాబంధన్

**కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**

**సికింద్రాబాద్, ఆగస్ట్ 09 ( సిద్దిపేట పవర్) :**

ఆడబిడ్డల ఆర్థిక సాధికారతే అసలైన రక్షాబంధన్ అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా పికెట్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కంటోన్మెంట్ బోర్డ్ జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులు, ఆశా ,అంగన్ వాడీ కార్యకర్తలు, మహిళా సోదరీమణులు ఎమ్మెల్యే కు రాఖీలు కట్టి దీవించారు. ఎమ్మెల్యే వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ..మహిళా సోదరీమణులను కోటీశ్వరులను చేయాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, మహిళ బాగుంటేనే కుటుంబం బాగుంటుందని, మహిళల భద్రత, సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తి లేదన్నారు



## ఘనంగా శ్రీసంతోషిమాత జన్మదినోత్సవ వేడుకలు..

**సికింద్రాబాద్, ఆగస్ట్ 09 ( సిద్దిపేట పవర్ ) :**

శ్రీసంతోషిమాత అమ్మవార్ల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ 4వవార్డు పికెట్ లోని సంతోషిమాత దేవాలయం లో శనివారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆలయాన్ని సందర్శించి, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.





## ఐదేళ్ళ తమ్ముడికి ప్రాణం పోసిన అక్క

**కిమ్స్ హాస్పిటల్‌లో రాఖీ కట్టి ధైర్యం చెప్పిన సోదరి**


**సికింద్రాబాద్, ఆగస్టు09 ( సిద్దిపేట పవర్):**

రాఖీ కట్టి ధైర్యం చెప్పడం ఒకటి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ్ముడి ప్రాణం కాపాడడం మరొకటి. ఆ రెండవది చేయాలంటే అసాధారణ ధైర్యం కావాలి. మానవ సంబంధాలు రోజు,రోజుకి క్షీణిస్తున్న ప్రస్తుత రోజుల్లో, ఓ అక్క తన తమ్ముడి కోసం అపోహాలను పక్కనపెట్టి తన శరీరంలోని మూలకణాలను దానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచింది. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్‌కు చెందిన ఐదేళ్ల బాలుడికి తీవ్రమైన అప్లాస్టిక్ అనీమియా అనే వ్యాధి అంటే ఎముక మజ్జ లోపంగా నిర్ధారణ అయ్యింది. పరిస్థితి తీవ్రంగా మారడంతో పలు వైద్య పరీక్షలు చేసిన సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రి డాక్టర్లు పేషంట్ మూలకణాలను మార్చాలని సూచించారు. దాంతో ఇంటర్ చదువుతున్న అక్క తన తమ్ముడికి ధైర్యం చెప్పి, తన శరీరంలోని మూలకణాలను దానం చేసి అతని ప్రాణాన్ని రక్షించింది. రాఖీ పండుగ రోజున శనివారం సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో తమ్ముడికి రాఖీ కట్టి, నీ కోసం నేను ఉన్నాను తమ్ముడు అని ధైర్యం చెప్పింది. ఈ సందర్భంగా డా. నరేందర్ కుమార్ తోట మాట్లాడుతూ, ఇది అక్కా తమ్ముళ్ల అనుబంధానికి నిజమైన నిదర్శనం అని, అపోహలను పక్కన పెట్టి ధైర్యంగా తమ్ముడి ప్రాణం కాపాడిందని అన్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్ పై దాడి చేసిన నర్సారెడ్డి ని అరెస్టు చేయాలి

**డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్**


**సిద్ధిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు : 09** సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయ్ పై దాడి చేసిన డిసిసి జిల్లా అధ్యక్షుడు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ని వెంటనే అరెస్టు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్ )జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. దాడికి గురైన విజయ్ ను కొండపాకలోని తన నివాసంలో శనివారంనాడు కలిసి శంకర్ దాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ... ఈ నెల 3 నాడు గజ్వేల్ లో జరిగిన రెషన్ కార్డుల పంపిణి ప్రభుత్వ కార్యక్రమంలో బహిరంగంగా కులం పేరుతో దూషించి, దాడి చేయడం తగదన్నారు. దాడి పై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చెసినప్పటికి విచారణ చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. దళితుడైన విజయ్ పై దాడి చెసిన నర్సారెడ్డి డిసిసి పదవి నుండి సస్పెండ్ చేయాలని కోరారు. కాంగ్రెస్ అంతర్గత కమ్ములాటలో ఎస్సీ, ఎస్టీ బిసి నాయకులను బలి పశువులను చెయవద్దని కోరారు. నర్సారెడ్డి కాంగ్రెస్ పార్టీ లోని రెడ్డి ని దూషించి దాడి చేయగలడా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా దళిత నేత సారధ్యం వహించడం, లొకసభ పక్ష నాయకుడు రాహుల్ గాంధి రాజ్యాంగ రక్షణ కొసం పోరాట చెస్తున్నామని చెబుతున్న పార్టీ లో దళిత నేతలను హత్య చేయడం, వారి పై దాడి చేయడం సిగ్గు చేటన్నారు. అగ్రకుల కాంగ్రెస్ నేతలు దళిత జపం చేయకుండా ఆచరణలో దళిత నాయకుల పై దాడి చేయకుండా చర్యలు తీసుకొవాలన్నారు. ఈ కార్యక్రమంలో డి సి సి ఉపాధ్యక్షులు ఏర్పుల మల్లేశం, అంకిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ నర్సింగా రావు, జర్నలిస్ట్ ముస్త్యాల యాదగిరి, న్యావాది మహిపాల్, ఎన్ స్ యు ఐ జిల్లా కార్యదర్శి భాను చందు, కిషన్, తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటి మొదటి బిల్లు అందజేసిన ఎమ్మెల్యే.

**వనపర్తి,ఆగస్టు 09(సిద్దిపేట పవర్):**

ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు రాజేశ్వరికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రభుత్వం తరఫున మంజూరైన మొదటి ఇందిరమ్మ ఇంటి బిల్లు చెక్కును అందించారు.ఈ సందర్భంగా లబ్ధిదారు రాజేశ్వరి మాట్లాడుతూ గత పదేళ్ల BRS పాలనలో ఇల్లు మంజూరు చేయాలంటూ ఎన్నోసార్లు అధికారులు చుట్టూ తిరిగిన పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నేడు ఇందిరమ్మ ఇంటి పట్టా సర్టిఫికెట్ను నాకు పిలిచి అందజేశారని ఇందిరమ్మ రాజ్యంలో నిజమైన నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఇల్లు నిర్మించుకుంటున్న తనకి మొదటి 1 లక్ష రూపాయల బిల్లును ఎమ్మెల్యేనే స్వయంగా వచ్చి అందజేయడం తనకెంతో ఆనందంగా ఉందని ఆమె ఎమ్మెల్యే మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో pacs అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి, సింగల్ విండో డైరెక్టర్ సాయి చరణ్ రెడ్డి, ఆగరం ప్రకాష్,రవి నాయక్, బాలకృష్ణారెడ్డి,రామకృష్ణారెడ్డి, మున్నూరు జయకర్,కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షులు నవీన్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ యాదగిరి,క్యామ రాజు,శ్రీరాములు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో అంబరాన్ని అంటిన రాఖీల సంబరం..

- **కుల మతాలకు అతీతంగా సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హరికృష్ణ కు రాఖీలు కట్టిన మహిళలు..**
- **ఆత్మీయ అనుబంధానికి,మరియు అన్న చెల్లెళ్ళ అనుభందానికి ప్రతీక రాక్షభందన్ #సిద్దిపేట ఇంచార్జి పూజల హరికృష్ణ.**

**సిద్దిపేట పవర్**

సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంప్ ఆఫీసులో రాఖీ పౌర్ణమి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఉదయం నుండే పార్టీకి చెందిన పలువురు మహిళ నాయకురాళ్లు నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణకి రాఖీలు కట్టి తమ సంతోషాన్ని వెలిబుచ్చారు. పార్టీ లో ఒక అన్న గా, తమ్ముడిగా హరికృష్ణ తమకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో కుల మతాలకు అతీతంగా హరికృష్ణ ఆధ్వర్యంలో అభివృద్ధి జరుగుతుందని, మహిళలను అభివృద్ధి చెందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకు వస్తున్న పథకాలను హరికృష్ణ ఆధ్వర్యంలో అందరికీ అందేలా చూస్తామని అన్నారు. అనంతరం హరికృష్ణ మాట్లాడుతూ ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్ అక్కా తమ్ముళ్ల,అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్ అని పేర్కొన్నారు ఈ రాఖి పౌర్ణమి పర్వ దినాన్ని ప్రతి ఇంటా ఆనందంగా జరుపు కోవాలని ఆకాక్షించారు గత ప్రభుత్వంలో మహిళలకు సాముచిత స్థానం దక్కలేదని తమ కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని అందులో భాగంగా ప్రభుత్వ పథకాలు మహిళల పేరు మీదనే అమలు చేస్తుందాన్నారు మహిళా నాయకురాళ్లకు మంత్రి పదవులతో పాటు మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా అనేక పథకాలను ప్రభుత్వం తీసుకు వచ్చిందని మహిళల కు తగిన గుర్తింపు గౌరవం కాంగ్రెస్ పార్టీ లో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమం లో డీసీసీ మహిళా అధ్యక్షులు ముద్దం లక్ష్మి,31 వార్డు ఇంచార్జి



పయ్యావుల సందీప్ యాదవ్,nsui జిల్లా అధ్యక్షులు అజమాత్,nsui వర్కింగ్ ప్రెసిడెంట్ రషద్,చెంది శ్రీనివాస్ ముదిరాజ్ ,వెంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు ఉప్పెరెట్ల సంతోష,మంద వనజ,పద్మ,భవాని,రేణుక,కవిత,సన,బిజాని,ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు



## ఆగస్ట్ 16న పరిగి మంద కృష్ణమాదిగ రాక

- **ఆగస్ట్ 16న వికలాంగుల, చేయూత పెన్షన్ దారుల సన్నాహక సభ..**
- **వికలాంగులు, చేయుత పెన్షన్ దారుల పెన్షన్ వెంటనే పెంచాలి**
- **ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ..**

**పరిగి ఆగస్టు 09(సిద్దిపేట పవర్ ):** వి హెచ్ పి ఎస్, ఎమ్మార్పీఎస్ పరిగి నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశనికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా ఇంచార్జి (రాష్ట్ర కార్యదర్శి) గట్టగల్ల ప్రశాంత్ మాదిగ హాజరై ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు 6వేలు, వృద్ధులకు, వితంతువులకు, చేయూత పెన్షన్ దారులకు 4వేలు పెన్షన్ వెంటనే పెంచాలనీ డిమాండ్ చేస్తూ ఆగస్ట్ 16న పరిగి నియోజకవర్గం వికలాంగుల, చేయూత పెన్షన్ దారుల సన్నాహక సభ నిర్వహించినున్నారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ వస్తున్నారు అని అన్నారు. పరిగి నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, చేయూత పెన్షన్ దారులంతా అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్ మాదిగ, జిల్లా సీనియర్ నాయకులు పరిగి మండల ఇంచార్జి గుట్టకింది రవి కుమార్ మాదిగ, పూడూరు మండల ఇంచార్జి చిడిగిద్ద కిష్టన్న మాదిగ, వి హెచ్ పి ఎస్ పరిగి మండల ఇంచార్జి సుమంగుర్తి ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఆర్ అంజి మాదిగ, ఎమ్మార్పీఎస్ పరిగి మండల సీనియర్ నాయకులు లాజర్ మాదిగ, శంకర్, రమేష్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.




## శంకర్‌పల్లిలో 65వ భారత యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

**శంకర్‌పల్లి ఆగస్టు 09(సిద్దిపేట పవర్ ):** శంకర్‌పల్లి మండల కేంద్రంలో శనివారం 65వ భారత యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. మండల యువజన కాంగ్రెస్ సభ్యుల ఆధ్వర్యంలో నిరుపేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ యూత్ లీడర్ కొనింటి శశికాంత్, యూత్ మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ మల్లేష్, అజస్, భరత్, ప్రశాంత్, సంపత్, కిషోర్, ప్రశాంత్, లోకేష్, రమేష్, నజీమ్, జగన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలను పాటిద్దాం.. రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం.

- **వాహనదారులు ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలి.**
- **సీఐ కృష్ణయ్య.**

**హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వారికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన ట్రాఫిక్ పోలీసులు.**

**వనపర్తి,ఆగస్టు 09(సిద్దిపేట పవర్):**

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని వనపర్తి సీఐ కృష్ణయ్య అన్నారు. శనివారం రక్షాబంధన్ సందర్భంగా వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు సీఐ, కృష్ణయ్య వనపర్తి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో హెల్మెట్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వాహనదారులకు మహిళా కానిస్టేబుళ్లు, ట్రాఫిక్ కానిస్టేబుళ్ళతో రాఖీలను కట్టి పువ్వులను స్వీట్లు పంచుతూ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణయ్య మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ మన అందరి బాధ్యత అన్నారు. సమిష్టి కృషితోనే ప్రమాదాలను నివారించ వచ్చన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ కచ్చితంగా ధరించాలని, మద్యం సేవించి,అధిక వేగంతో వాహనాలు నడపరాదని, వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే నష్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. హెల్మెట్ ఉపయోగం గురించి విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తామనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ ఎస్సై, హరి ప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై, సురేందర్ , మహిళ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.









## చర్లపల్లి ఖైదీల వ్యవసాయ కాలనీని సందర్శించిన జస్టిస్ సామ్ కోషి

**చర్లపల్లి,ఆగస్ట్ 9(సిద్దిపేట పవర్ ):** తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మరియు తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సామ్ కోషి శనివారం చెర్లపల్లి ఖైదీల వ్యవసాయ కాలనీని సందర్శించారు. తన పర్యటన సందర్భంగా, జస్టిస్ సామ్ కోషి కోళ్ల పెంపకం, పాల ఉత్పత్తి, తేనెటీగల పెంపకం యూనిట్లు, వ్యవసాయ క్షేత్రాలు మరియు నర్సరీతో సహా వివిధ సౌకర్యాలను పరిశీలించారు. ఆయన ఖైదీలు మరియు జైలు అధికారులతో సంభాషించారు, ఓపెన్ జైలు పనితీరు, ఖైదీలు చేపట్టే కార్యకలాపాలు మరియు దాని అంతర్లీన ఉద్దేశ్యం పై అంతర్దృష్టిని పొందారు. ఖైదీలను ఉద్దేశించి జస్టిస్ సామ్ కోషి భూమి, ప్రకృతి మరియు జంతువులకు సేవ చేయడం ఒక గొప్ప ప్రయత్నంగా అభివర్ణించారు. ఓపెన్ జైలు వ్యవస్థ ప్రత్యేకమైనదని, సాంప్రదాయ జైళ్ల నుండి భిన్నంగా ఉంటుందని మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న దిద్దుబాటు సౌకర్యాలకు ప్రేరణగా పనిచేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. "ఓపెన్ జైళ్లు ఖైదీలను ప్రధాన స్రవంతితో అనుసంధానించడానికి ఒక వినూత్న మార్గం. ఇక్కడ జరుగుతున్న పనికి ప్రపంచ గుర్తింపు అవసరం అని ఆయన అన్నారు. ఓపెన్ జైలులో పనిచేస్తున్న ఖైదీలు అదృష్టవంతులని ఆయన పేర్కొన్నారు మరియు బాధ్యతాయుతమైన పౌరులుగా తమను తాము మార్చుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తరువాత, హైదరాబాద్ రేంజ్ జైళ్ల డిఐజి డాక్టర్ డి. శ్రీనివాస్, జస్టిస్ కోషికి వివిధ కార్యకలాపాల గురించి వివరించారు. ఈ పర్యటనలో భాగంగా, జస్టిస్ కోషి జైలు ఆవరణలో ఒక మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డిఎల్ఎస్ఎ మేడ్చల్ మల్కాజ్‌గిరి కార్యదర్శి కిరణ్ కుమార్, టిఎస్ఎల్ఎస్ఎ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ముదిగొండ రాజు, చెర్లపల్లి జైలు సూపరింటెండెంట్ ఎన్. శివకుమార్ గౌడ్; పిఎసి సూపరింటెండెంట్ డి. కాళిదాస్,జైలర్ ఆర్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

